క్లుప్తంగా

ఏలూరులో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న నగర ప్రముఖులు

ఏలూరు (టూటౌన్): ఆపరేషన్ సిందూర్, వీరోచితంగా పోరాడి విజయం సాధించిన భారత త్రివిధ దళాల సైనికులకు సంఘీభావం తెలియజేస్తూ ఏలూరులో శుక్రవారం సాయంత్రం తిరంగా ర్యాలీ కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక వన్‌టౌన్ రామకోటి నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షులు సీహెచ్ విక్రమ్ కిషోర్ పాల్గొన్నారు.

19న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ఏలూరు (టూటౌన్): పేదలకు స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 11.00 గంటలకు ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్టు సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ దశల వారీగా అర్జీలు నమోదు చేయించినట్టు తెలిపారు. ఈ అర్జీలను పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు.

ఉద్యోగం పేరుతో మోసం

ఏలూరు టౌన్: ఏలూరుకు చెందిన ఒక వ్యక్తిని సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఒక అపరిచిత వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. అతని వద్ద రూ.5 లక్షలు కాజేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఏలూరు వన్‌టౌన్ తూర్పువీధికి చెందిన షణ్ముఖ శ్రీ వెంకట దుర్గాసాయికి ఆన్‌లైన్ లో గోవింద్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ప్రతిరోజూ ఇద్దరూ ఫోనులో చాటింగ్ చేసుకునేవారు. తనకు సాఫ్ట్ వేర్ కంపెనీ ఉందని పలువురికి ఉద్యోగాలు ఇచ్చానని గోవింద్ మాట్లాడుతూ దుర్గా సాయిని నమ్మించాడు. ఇదే క్రమంలో మరో నలుగురిని ఆన్‌లైన్‌లో పరిచయం చేశాడు. వారంతా తాము గోవింద్ వద్ద ఉద్యోగాలు పొందామని నమ్మించారు. ఆ మాటలు నమ్మిన దుర్గా సాయి తనకు, తన భార్యకు సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు కావాలని కోరాడు. ఉద్యోగాల కోసం గోవింద్ రూ.5 లక్షలు డిపాజిట్ కట్టాలని చెప్పటంతో బాధితుడు డబ్బులు గోవింద్ అకౌంట్‌కు ఆన్‌లైన్‌లో జమ చేశాడు. డబ్బులు అందగానే గోవింద్ ఇక అందుబాటులో లేకుండాపోయాడు. దీంతో బాధితుడు ఏలూరు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మధుర ఫలం.. జోరుగా విక్రయం

- మామిడి పండ్లకు గిరాకీ
- బంగినపల్లి, చిన్న రసాల కొనుగోలుకు ఆసక్తి
- ఏలూరుకు నిత్యం 60 నుంచి 70 ఆటోల్లో మామిడి పండ్ల రాక



దుకాణం వద్ద మామిడి పండ్లు కొంటున్న వినియోగదారుడు



వేకువ జామునే మామిడి పండ్ల విక్రయం

ఏలూరు (టూటౌన్): పండ్లలో రారాజు మామిడి పండు. ఈ పండు పేరు చెబితేనే నోరూరుతుంది. మామిడి పండ్లలో చిన్న రసాలు, బంగినపల్లి వంటి రకాలకు మంచి గిరాకీ ఉంది. సాధారణంగా మామిడి పండ్లు ఏప్రిల్ నుంచి జూలై వరకు విరివిగా లభిస్తాయి. ఏలూరు మార్కెట్‌కు విరివిగా మామిడి పండ్లు వస్తున్నాయి. ప్రధానంగా నూజివీడు, చింతలపూడి, లింగపాలెం, టి.నరసాపురం, పెదవేగి ప్రాంతాల నుంచి రైతులు మామిడి పండ్లను తెల్లవారు జామునే ఏలూరు తీసుకొచ్చి హోల్ సేల్‌గా ట్రేల లెక్కన విక్రయిస్తున్నారు. మామిడి పండు రకం సైజును బట్టి ఒక ట్రే ధర రూ.400 నుంచి రూ.800 పలుకుతుంది. ట్రేలో సైజును బట్టి 50 నుంచి 60 మామిడి కాయలు ఉంటాయి.

నిత్యం 70 ఆటోల్లో మామిడి పండ్ల రాక

ఏలూరు మార్కెట్‌కు ప్రతి రోజూ 70 ఆటోల్లో రైతులు మామిడి పండ్లను ట్రేలలో తీసుకొస్తున్నారు. తెల్లవారు జామున 4 నుంచి ఉదయం 7 గంటల్లోపు హోల్‌సేల్ వ్యాపారం ముగిసిపోతుంది. సుమారు 200 మంది వరకు చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు ఆ సమయంలో మార్కెట్‌కు వచ్చి తమకు నచ్చిన రకాలను ట్రేల లెక్కన కొని, ఏలూరు రైల్వే ట్రాక్, పెరుగుచెట్టు సెంటర్, తంగెళ్లమూడి సెంటర్లలో అమ్ముతున్నారు.

రైల్వే ట్రాక్ రోడ్డులో పండ్ల దుకాణాలు

ఏలూరు ఫ్లై ఓవర్ పక్కనే ఉన్న ట్రాక్ రోడ్డులో పెద్ద ఎత్తున మామిడి కాయలు, పండ్లను విక్రయిస్తున్నారు. తెల్లవారు జామున సమీప ప్రాంతాల రైతులు ఆటోలు, ట్రాక్టర్లలో మామిడి పండ్లను ఏలూరు తీసుకొస్తుంటారు. వాటిని రిటైల్ వర్తకులు కొనుగోలు చేసి ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేంత వరకు విక్రయిస్తున్నారు. ఈ రోడ్డులో అరకిలో మీటరు పొడవునా మామిడి పండ్ల దుకాణాలు ఉన్నాయి. పండ్ల కొనుగోలుదారులతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది.

పరక లెక్కన విక్రయాలు

ఏలూరులో మామిడి పండ్లను పరక లెక్కన విక్రయిస్తుంటారు. కాయ రకం, సైజును బట్టి పరక రూ.150 నుంచి రూ.600 వరకు పలుకుతుంది. ట్రేల లెక్కన రైతుల నుంచి మామిడి పండ్లు కొని, పరక (14 కాయలు) లెక్కన ప్రజలకు విక్రయిస్తున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు. నిత్యం ఖర్చులు పోను రూ.500 నుంచి రూ.1000 మిగులుతాయని తెలిపారు.

పోషకాలు అధికం

మామిడి పండ్లలో ఉండే పాలీఫినోల్ ఇందుకు సహకరిస్తుంది. మామిడిలో 15 శాతం చక్కెర, ఒక శాతం మాంసకృతులు, ఏ, బీ, సీ విటమిన్లు ఉంటాయి. పిండి పదార్థాలు 17 గ్రాములు, మాంసకృతులు 51 గ్రాములు, థయామిన్ 0.58 గ్రాములు, సియాసిన్ 0.584 గ్రాములు ఉంటాయి.

ఆశించిన మేర లాభాల్లేవ్



ఏటా వేసవిలో ఏలూరు మార్కెట్‌కు నూజివీడు నుంచి ఆటోలో 25 ట్రేలలో మామిడి పండ్లు తీసుకొచ్చి విక్రయిస్తుంటాను. ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉండటంతో రైతులకు ఆశించినంత మేర లాభాలు రావడం లేదు. ప్రధానంగా చిన్న, పెద్ద, చెరకు రసాలు, బంగినపల్లి మామిడి పండ్లకు మంచి గిరాకీ ఉంది. గత 15 ఏళ్ల నుంచి ఏలూరు మార్కెట్‌కు మామిడి పండ్లను తీసుకొస్తున్నాను.

– ఎస్ లాజరు, మామిడి పండ్ల రైతు, నూజివీడు

ఆరోగ్యానికి మంచిది



సీజనల్ వారీగా దొరికే పండ్లను తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వేసవిలో దొరికే మామిడి పండ్లు తినడం వల్ల ఆరోగ్యానికి మంచిది. చిన్న రసాలు, బంగినపల్లి కాయలను లభించిన అన్ని రోజులు క్రమం తప్పకుండా కొనుగోలు చేసి వినియోగిస్తుంటాం. మామిడి పండ్లు రుచి ఎంతో మధురంగా ఉండటం వల్ల వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాం.

– వెంపా నాగరాజు, కొనుగోలుదారుడు, మల్కాపురం, ఏలూరు రూరల్

రోజుకు వెయ్యి వరకు ఆదాయం



ఏటా మామిడి పండ్ల సీజన్‌లో స్థానిక ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న ట్రాక్ రోడ్డులో మామిడి పండ్లను విక్రయిస్తుంటాను. దోసపాడు నుంచి ప్రతి రోజూ ఉదయాన్నే ఏలూరు వచ్చి హోల్ సేల్‌గా ట్రేలలో మామిడి పండ్లను కొని రిటైల్‌గా విక్రయిస్తుంటాను. రోజుకు అన్ని రకాల పండ్లు కలిపి 10 ట్రేల వరకు విక్రయిస్తుంటాను. ఖర్చులు పోను రోజుకు రూ.700 నుంచి రూ.1000 ఆదాయం లభిస్తుంది.

– బల్లా కుసుమ, మామిడి పండ్ల విక్రేత, దోసపాడు, దెందులూరు మండలం

డెంగీ నివారణపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చాటపర్రులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చాటపర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.కృష్ణ ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ ఎంవీ రామాంజనేయులు, బీహెచ్ఎస్ మోహన్, సూపర్‌వైజర్ కిరణ్ కుమార్, ఎస్ఎం సంధ్యారాణి, ఆశ కార్యకర్తలు ఫ్లెక్సీలు పట్టుకుని డెంగీ లక్షణాలు నివారణ వైద్య సౌకర్యం వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు పీహెచ్‌సీ నుంచి గ్రామంలో పలు వీధుల్లో ర్యాలీ కొనసాగింది.

హాస్టల్ భవనాల పరిశీలనకు ప్రత్యేక కమిటీ

ఏలూరు(మెట్రో): జిల్లాలో శిథిలావస్థలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల భవనాల పరిస్థితిని పరిశీలించడానికి కమిటీని నియమిస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్స్ మరమ్మతులు, అభివృద్ధి పనుల పురోగతిపై ఆమె సమీక్షించారు. కమిటీ నివేదిక ఆధారంగా వసతి గృహ భవనాల పునర్నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మంచి వసతి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వేసవి సెలవులు ముగిసే నాటికి పనులు పూర్తిచేయాలని సంబంధిత శాఖల ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ ఎం ముక్కంటి, సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్, వివిధ శాఖల ఇంజినీర్లు, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర కార్యదర్శి లక్ష్మీ ఇందిర

ఏలూరు (టూటౌన్): ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని అడ్డగర్ల లక్ష్మీ ఇందిర ఆరోపించారు. ఆర్ఆర్‌పేట స్ఫూర్తి భవన్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర సమితి ముఖ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సమస్యల పరిష్కారం, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణకు ఈనెల 24న శనివారం ఏలూరు ఏరియా సమితి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు నగర అధ్యక్షురాలు కొండేటి బేబీ మాట్లాడుతూ మహిళా సమాఖ్య మహిళల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించిందని వివరించారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షురాలు గొర్లి స్వాతి నగర సమితి సభ్యులు ఉప్పులూరి లక్ష్మి భవాని తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత, పచ్చదనంపై అవగాహన కల్పించాలి

కలెక్టరు వెట్రిసెల్వి





మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఏలూరు(మెట్రో): స్వర్ణాంధ్ర, స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మే నెలలో వేడిని ఓడించండి ఇతివృత్తానికి అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో ఈనెల 17వ తేదీ శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ నిర్వహణపై అధికారులతో ఆమె సమీక్షించారు. వేడి ప్రభావాలను తగ్గించడానికి ప్రజల్లో అవగాహన పెంచేందుకు శనివారం పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పిల్లల్లో వాతావరణంపై అవగాహన పెంపొందించడానికి బీట్ ది హిట్ అనే ఇతివృత్తంపై డ్రాయింగ్, వ్యాచరచన పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. నీటిని సంరక్షించడానికి కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు, పాఠశాలలో వర్షపు నీటిని సంరక్షణ నిర్మాణాలను ప్రోత్సహించాలన్నారు. వృద్ధులు, పిల్లలు, కార్మికులు, బహిరంగ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ఉపాధి హామీ పని ప్రదేశాలు, కాలనీలు, ఇతర నిర్మాణ పనుల ప్రాంతాల్లో చలివేంద్రాలు, షెడ్ నెట్లు, వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలన్నారు. బస్సు స్టాప్‌లు, రైల్వేస్టేషన్లు, మతపరమైన ప్రదేశాలు, మార్కెటు ప్రాంతాల్లో షెడ్ నెట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, సీపీఓ వాసుదేవరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, డీసీహెచ్ఎస్ పాల్ సతీష్ కుమార్, జిల్లా వైద్య శాఖ అధికారి ఆర్ మాలిని, డీఈఓ కె.వెంకట లక్ష్మమ్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ బాషా, ఉద్యానవన శాఖ డీడీ ఎస్.రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్ఈ నాగార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వరరావు, పరిశ్రమల శాఖ డీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం ముక్కంటి, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి ఎస్ఎస్ కృపావరం, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డీసీఓ శ్రీనివాసు, పశుసంవర్ధక శాఖ జెడీ గోవిందరాజులు, మున్సిపల్ కమిషనరు భాను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీలత

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలో గ్రామ గ్రామానా శనివారం బీట్ ద హీట్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఏలూరు ఎంపీడీఓ సుజాత అన్నారు. శుక్రవారం ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పథకాల లబ్ధి ఆధారపడి ఉందని అన్నారు. గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటు, పశువులకు తాగునీరు, వైద్య శిబిరాలు, పశు వైద్య శిబిరాలు, తడి, పొడి చెత్తల పర్యవేక్షణ, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు, పారిశుద్ధ్యం పనులు చేస్తారని తెలిపారు. నెలలో ప్రతి మూడో శనివారం విధిగా అన్ని గ్రామాల్లో అన్ని శాఖల అధికారులు ఈ పనులన్నీ చేస్తారని చెప్పారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	50
బెండకాయలు	34	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	28-34	కంద	--
కాకర కాయలు	40	బీట్‌రూట్	36
బీరకాయలు	34	కీరా దోస	38
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	20	అల్లం	58
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	28	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	22
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	15
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	18
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	18
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

రెండో రోజుకు రిలే దీక్షలు



బుట్టాయగూడెంలో దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

బుట్టాయగూడెం: గిరిజనులకు ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ ప్రకటించాలని, గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాని, గిరిజన ప్రాంతంలో ఉద్యోగ నియామక చట్టం చేయాలని, ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. మెగా డీఎస్సీ – 2025లో ప్రకటించిన ఏజెన్సీ పోస్టులను నోటిఫికేషన్ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. దీక్షలో సుమారు 15 మంది పైగా కూర్చోగా, కార్యక్రమంలో జేఏసీ నాయకులు మడకం రమేష్, బుధుల నాగేంద్రబాబు, కణితి శ్రీకాంత్, నింజా వెంకన్నబాబు, కొమరం రాము, మడకం దుర్గారావు, గోరం పెంటారావు, బన్నె వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం పనిచేయకపోవడంతో అవస్థలు

ఉంగుటూరు: ఉంగుటూరులో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు చెందిన ఏకైక ఏటీఎం కేంద్రం పని చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు నెలల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉందని ప్రజలు వాపోతున్నారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, ప్రజలు, రైతులు, వ్యాపారులు అంతా ఏటీఎం సేవలు అందకపోవడంతో నారాయణపురం వెళ్లి సొమ్ము విత్‌డ్రా చేసుకుంటున్నారు. ఏటీఎంకు రిపేరు రావడంతో కొత్త ఏటీఎం వచ్చిందని, ఆ మెషీన్‌లోనూ సాంకేతిక లోపం ఏర్పడడంతో కొత్త మెషీన్ ఏర్పాటు జాప్యం జరిగిందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.

నాణ్యతకు తిలోదకాలు

- శుచి, శుభ్రతలు పాటించని హోటళ్లు
- ఇష్టానుసారం ఆహార పదార్థాల విక్రయాలు
- మిగిలిపోయిన వెజ్, నాన్‌వెజ్ వంటకాలు నిల్వ చేసి అమ్మకాలు
- లాభార్జనే ధ్యేయంగా వ్యాపారం



హోటళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

దెందులూరు : వేడి, వేడి, రంగు రంగుల ఆహార పదార్థాలు నోరూరిస్తాయి. పొగలు కక్కుతూ, ప్లేట్‌లో కనిపిస్తే తినేయాలనిస్తాయి. వెజ్, నాన్‌వెజ్ డిష్‌లన్నీ హోటళ్లలో ఆకట్టుకునేలా ఉంటాయి. కానీ వాటి వెనుక పరిశీలిస్తే అనారోగ్యమే కనిపిస్తోంది. కిచెన్‌లోకి వెళ్లి గమనిస్తే ఒళ్లు జలదరింపజేసే నిజాలు వెలకివస్తాయి. అపరిశుభ్రత, ఆరోజు మిగిలిపోయిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో నిల్వ చేసి తర్వాత సాగించే అమ్మవాలు, వాడేసిన నూనెను మళ్లీమళ్లీ వాడి వండుతున్న వంటలు ఇలా ఎన్నో ఉన్నాయి. మనుషుల ఆరోగ్యంతో హోటళ్ల యజమానులు ఆడుకుంటున్నారు. నాణ్యతను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వంటకాలు విక్రయించి అనారోగ్యపాలు చేస్తున్నారు. వాటిని గమనించి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు కోరుతున్నారు.

నిల్వ పదార్థాల విక్రయం

మండలంలో వందకుపైగా, వెజ్, నాన్‌వెజ్ హోటళ్లు ఉన్నాయి. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం డిన్నర్ వరకూ రకరకాల ఆహారాన్ని అందిస్తున్నాయి. అయితే వీటిలో పేరుపడిన హోటళ్లు కూడా మిగిలిపోయిన ఆహారాన్ని నిల్వ చేసి తర్వాత అందిస్తున్నట్లు అధికారులు దాడుల్లో బహిర్గతమయ్యింది.

బిర్యానీ, చికెన్ ఎప్పటివో?

రాత్రి మిగిలిపోయిన బిర్యానీ, చికెన్‌ను మరుసటి రోజు వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ నిబంధలనలు ప్రకారం వాటిని మరుసటి రోజు విక్రయించకూడదు. కేవలం పచ్చి మాంసం, నిర్దేశిత టెంపరేచర్‌లో ఉంచుకోవాలి. కానీ హోటల్ వాళ్లు సాధారణ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచి మరీ మాంసం వరుసటి రోజు వినియోగదారులకు వండి విక్రయిస్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



కలుషిత ఆహారం తినడం వల్ల అనారోగ్యం పాలవడం తప్పదు. బయట హోటల్‌కి వెళ్లే, ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌వద్ద తీసుకొనే ఆహారంపై దృష్టి సారించాలి. ముఖ్యంగా మాంసాహారంలో రంగులు కలపడంవల్ల క్యాన్సర్ వస్తుంది. వంటల్లో వాడే ఫుడ్ కలర్, నిల్వ ఉంచిన మాంసం తినడంవల్ల అనేక రకాలైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

– డాక్టర్ పవన్, వైద్యాధికారి, దెందులూరు సీహెచ్‌సీ

సారా నిర్మూలనకు నవోదయం



నవోదయం 2.0 కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారిణి

పోలవరం రూరల్: సారా నిర్మూలనలో భాగంగా నవోదయం 2.0 కార్యక్రమాన్ని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, ఎక్సైజ్ సీఐ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో పోలవరం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ సారా తయారీ విక్రయాలతో జీవనం సాగించేవారు నవోదయం 2.0 ద్వారా ప్రత్యమ్నయంగా ఉపాధి పొందేటట్ల చర్యలు చేపడతామన్నారు. అర్హులకు వెలుగు ద్వారా ఉపాధి పొందేటట్ల చూడాలని ఏపీఎంలకు సూచించారు. డీఆర్‌డీఏ పీఎం ఇ.అనిత మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో ఉండి అర్హత ఉన్న వారికి బ్యాంకు లింకేజ్ స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ వంటి పథకాల ద్వారా రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రాజబాబు, ఉన్నతి ఏపీఎం సుమతి, పోలవరం, కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం మండలాల వెలుగు ఏపీఎంలు జేమ్స్, శ్రీనివాస్, పద్మావతి, కైకలూరు ఎక్సైజ్ సీఐ రమేష్, మండల సమైక్య సీసీలు, ఉన్నతాధికారులు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, పాల్గొన్నారు.